# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

ఆ వేపచెట్టు కింద తలెత్తకుండా అంట్లు తోముతోందే-ఆ పిల్ల పేరుజువ్వి. 'మడిసల్లే ఎందుకు బతుకుతావే! మానల్లే పడుండు సుకపడతావు' అని ఆ తల్లి కూతురుకి జువ్వి అని పేరెట్టిందేమో తెలియదు. కానీ జువ్వి మనిషిలా బతకాలని, నవ్వాలని, ఏడవాలని కలలు గంటోంది. జువ్వి దొడ్లోకి రావడం ఆలస్యం చెట్లమీది కాకులన్నీ వచ్చి చేరతాయి.

ఉడతలు కొమ్మ తొర్రల్లోంచి పరుగెత్తుకొస్తాయి. రామచిలకలు చిటారు కొమ్మ నించి కింద కొమ్మలమీదికి రివ్వున వచ్చి వాలతాయి. జువ్వి అంట్లు ఒక్కొక్కటే తెచ్చి పడేసుకుంటుంటే కాకులు గెంతుతూ ఇంకా దగ్గర కొస్తాయి. "ఉండండే! ఒకటే తొందర!" అని విసుక్కుంటుంది జువ్వి. కాకులు ముక్కులు రాసుకుంటూ రెక్కలు టపటప కొట్టుకుంటూ ఇంకా దగ్గరకొస్తాయి. గిన్నెలలో అడుగు మెతుకులు తీసి రాయిమీద పెడ్తే వాట్ని కలబెడ్తూ తన్నుకుంటూ తింటుంటాయి కాకులు. "కొట్టుకు చావమాకండే కాస్తదానికి" అని మందలిస్తుంది జువ్వి. ఓ కూర ముక్క తొర్రలోంచి తొంగి చూస్తున్న ఉడత కోసం విసుర్తుంది. కొమ్మ మీదున్న రామచిలకని చూసి "నువ్వు రాణివాసం పిట్టవామె! నువ్వు ఎంగిలిమెతుకుల కొస్తావా! ఇదో!" అని నవ్వుతూ నవ్వుతూ ఏరుకొచ్చిన చింతకాయలు ఎగరేస్తుంది. ఓ చింతకాయ రామచిలక ముక్కున పట్టుకుంటే కిందపడ్డ ఇంకో చింతకాయ కోసం ఉడత పరుగెత్తుతుంది. ఏదో తినడం అయిపోయింది గదా అని వెళ్ళిపోవు పక్షులు. జువ్వి అంట్లు తోముతుంటే చుట్టూ సభ చేసినట్టు చేరతాయి. ఓ కాకి రాయిమీద, ఇంకోటి గుట్టమీద, మరోటి బోర్లించిన గిన్నెమీద ఇలా చుట్టూ చేరి జువ్వి చెప్పే కబుర్లు ఆలకిస్తూ వుంటాయి. అంట్లు తోముకుంటూ జువ్వి తన గోడంతా వీటికి వెళ్ళబోసుకుంటుంది.

"చింతాలు మావ ఏ రేవు నున్నాడో చూసిరాకూడదంటే! ఆడి పడవ అమరావతొద్దుతాకి నెల్రోజు లయింది. నా మెళ్ళో తాళికడ్తే నేను చక్కంగ వంటచేసి పెడ్దునా? ఆడు పడవల్లో చేరి అళ్ళకీ ఈళ్ళకీ వండి పెట్టే కర్మ ఏంది? అసల్లే ఆడిదేం తప్పు? మా అయ్యదే తప్పు. "సంపాదన లేనోడికి పిల్లనిస్తావా" అన్నాడు. పడవల్లో వంటపుట్టికింద చేరిపోయిండు. అమ్మ పోయినకాణ్ణించి అయ్య విడిచి పెట్టలేక నేనున్నాను. నేం తెచ్చే అన్నం మెతుకుల కోసం నన్నిడిచి పెట్టనంటడు అయ్య. పోన్లే నా అన్నం తింటే తిన్నాడు. అణ్ణీ, ఈణ్ణీ డబ్బులడుక్కుని ఆ తాగుడెందుకంట! ఏంజేస్తాం చెప్పు. తాగినా తన్నినా అయ్య అయ్యే కద. నేను మా మావెంట ఎల్లిపోతే ఆడికి దిక్కెవరు?

ఏవే! మావ పడవ దొండపాడు రేవుకాడుందన్నారే ఎట్టుండాడో, చూసి రాకూడదంటే... ఆడు లాంచీల్లో చేర్తాడని ఎవరో చెప్పారు. ఒద్దని చెప్పవే! లాంచీల్లో చేర్తే కిట్ట ఇడిసి పెట్టి గోదార్లో కెల్తాడు. అవలే మావందరు.

రోజూ ఇదే పాట... జువ్వి మళ్ళీ మళ్ళీ చెప్తాండడం కాకులు అంతా తెలిసిపోయినట్లు ఆలోచిస్తాం! అన్నట్టు ముక్కులతో రెక్కలు గీరుకుంటూ అంటూండడం. ఇంతలో ఇంటావిడ 'జువ్వీ! ఎవరితోనో మాట్లాడుతున్నావు' అంటే 'ఏం లేదమ్మా! ఈ కాకులు ఒకటే రొద! హేయ్' అంటూ కాకుల్ని అదిలించి అంట్లు ఇంట్లో ఇచ్చెయ్యడం మామూలు.

ఆ రోజు ఇంటావిడ జువ్వికి ఉప్పుడుపిండి పెట్టి 'తినవే' అంది. జువ్వికి ఏం పెట్టినా సరే ఆ ఆకు చేత్తో పట్టుకుని ఏడుస్తుంది. జువ్వి తల్లి కూడా అంట్లు తోమేది. ఇంటివాళ్ళు ఏవన్నా పెడ్తే జువ్వితల్లి మొగుడికి తెలియకుండా పదేళ్ళ జువ్వికి తీసుకొచ్చి పెట్టే కాని తినేది కాదు. 'తినవే' అని తల్లి అంటే 'అయ్యకో?' అని ఏడ్చేది. ఇప్పటికీ అంతే, ఆకు పట్టుకుని జువ్వి ఏడుస్తుంటే 'ఏడు పెందుకే పిచ్చిదానా!' అని ఇంటావిడ సముదాయిస్తే కళ్ళు తుడుచుకుని 'ఇంటికెళ్ళి తింటానమ్మా' అంది. 'ఓసి వెర్రి! మీ అయ్యకు నేను వేరే ఇస్తా. నువ్వు తిను' అని ఆవిడంటే అప్పుడు జువ్వి ముఖం విప్పారింది. నవ్వుకుంటూ ఆకు తీసుకు పరుగెత్తింది.

శ్రావణ మాసాన—

కృష్ణ నిండుగా వొడ్లు పొంగి పారుతున్నవేళ. పూజారి వీధి ఇళ్ళు ఆనుకుని కృష్ణ పారుతుంటే, కృష్ణ మధ్య నుంచి వడిలో పడవలు పోలేవు కనుక వొడ్డమ్మటే పడవలు లాక్కెళుతుంటే పడవలన్నీ దొడ్లలోంచి పోతున్నట్లుండేవి.

తెల్లవారగట్టే వచ్చింది జువ్వి పడవల కోసం. జువ్వితోపాటే కాకులూ, ఉడతలూ, రామచిలుకలూను. అంట్లు తోముతోందేకాని పడవల మీదే ధ్యాస. పరుగెత్తికెళ్ళి ప్రతి పడవ చూస్తోంది. చింతాలు మావ పడవ రాలేదు. కాకులన్నీ కావుకావు మంటూ కృష్ణమీది కెళ్ళాయి. అంటే పడవొస్తోందన్నమాట. జువ్వి అంట్ల గిన్నెతో పరుగెత్తుకెళ్ళింది. చాపికల తెరచాప పడవ దగ్గరకొస్తోంది. జువ్వి గుండె దబదబ కొట్టుకుంటోంది. అల్లదుగో! చింతాలు మావ! ముక్కాని దగ్గర వంట గిన్నెతో చెయ్యూపాడు. జువ్వి అంట్ల గిన్నె వూపింది. పడవ దగ్గర కొస్తోంది. జువ్వి కళ్ళు పొంగాయి. వొళ్ళు పొంగింది. కళ్ళలో కృష్ణ ముందు కొచ్చింది. జువ్వి దగ్గర కొచ్చింది




పడవ. చింతాల నవ్వుతూ కళ్ళన్నీ జువ్వి మీదే పెట్టి చూశాడు. జువ్వికి ఏదో అడుగుదామనిపించింది. మాట రాలేదు. చింతాలుకి ఏదో చెప్దామనిపించింది- గొంతు పెగల్లేదు. పడవ జువ్విని దాటిపోతోంది. చింతాలు లంకల్లో కోసుకొచ్చిన జామకాయ వొడ్డుమీదికి విసిరాడు. జువ్వి చెంగున ఎగిరి అందుకుంది. చాపికల తెరచాప దూరమయింది. చింతాలు మావ వెళ్ళిపోయాడు. ఇంటావిడ ఇంట్లోంచి 'జువ్వీ!' అని పిలవడంతో జువ్వి ఈ లోకంలోకి వచ్చింది. గెంతుకుంటూ దొడ్లోకొచ్చి ఎక్కడలేని సంబరంతో ఒక చేత అంట్లు తోముతూ ఇంకోచేత ప్రియంగా జామకాయ కొరుక్కు తింటోంది. తనింత కొరుక్కుని ఇంత ముక్క కాకులకి పెట్టింది. మరింత ముక్క ఉడత కిచ్చింది. మిగిలిన ముక్క రామచిలకల కెగరేసింది.

ఆ తరవాత ఇంటావిడ పల్లిపిండి పెడ్తే ఆకు పట్టుకు ఏడ్చింది జువ్వి. "మీఅయ్యకి నేను వేరే పెడ్తాలేవే" అన్నా జువ్వికి ఏడుపు ఆగలేదు. జువ్వి మళ్ళీ ఏడ్చింది. అయ్యకోసం గాదు చింతాలు మావకోసం.

కళ్ళు తుడుచుకుని ఇవతలకొచ్చి చుట్టూ చేరిన కాకులతో, ఉడతలతో, చిలకలతో అంది

"మా మావ పడవ ధరణికోట రేవు కాడుంటది. మీరెళ్ళి నేను మావ కోసం ఏడవ లేదని చెప్పండే! నవ్వానని చెప్పండే!" అంటూ గలగలా నవ్వింది.

ముత్యాలవాన